సాక్షి
జగిత్యాల
సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



తరలివచ్చి.. మొక్కులు చెల్లించి

వేములవాడ: రాజన్న సన్నిధి రద్దీతో కిటకిటలాడింది. సమ్మక్క జాతర సమీపిస్తుండటంతో స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. 8లో▸



సుల్తానాబాద్‌లో ఖోఖో..

కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఖోఖో, రాజన్న సిరిసిల్ల జిల్లాకు కబడ్డీ సెంటర్‌ను మంజూరు చేసింది. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35.0/21.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలంతా ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'కులగణన' మంచి నిర్ణయం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

జగిత్యాలటౌన్: బలహీనవర్గాల హక్కుల కోసం పోరాడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉన్న జీవన్‌రెడ్డికి మున్నూరుకాపులు అండగా నిలవాలని కోరారు. ఆయనను ఎంపీగా గెలిపించుకుందామని సూచించారు. ఆరు గ్యారంటీల అమలుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయం మంచి నిర్ణయమని పేర్కొన్నారు. మున్నూరుకాపుల కార్పొరేషన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజలు తనను రైతు బిడ్డగా ఆదరించారని పేర్కొన్నారు. మున్నూరు కాపు కల్యాణ మంటపం, సంఘం భవన పూర్తికి సహకరిస్తానని వెల్లడించారు. నాయకులు గిరి నాగభూషణం, విజయలక్ష్మి, రాచకొండ శ్రీరాములు, పుప్పాల అశోక్, తాండ్ర సురేందర్, ఆకుల నాగరాజు, చిట్ల రవీందర్, ఒడ్నాల రాజశేఖర్ పాల్గొన్నారు.

రాయికల్‌లో మహమ్మారిపై కళాజాత ప్రదర్శన



కళాజాతలో కళాకారులు

రాయికల్: మహమ్మారి ఎయిడ్స్ నిర్మూలనపై రాయికల్ పట్టణంలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జన జాగృతి కళావేదిక ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు గడ్డం రమేశ్, గంగాధర్‌నాయక్, సుమన్, డప్పు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న జంగయ్య

జగిత్యాలటౌన్: ఉపాధ్యాయ, ఉద్యోగులందరికీ ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెట్ సమస్యను పరిష్కరించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని, పదోన్నతులు, బదిలీలు చేయాలని కోరారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన యూటీఎఫ్ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు వెంటనే నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలను సమీక్షించాలన్నారు. మల్టీజోన్–2 పరిధిలో గెజిటెడ్ హెడ్మాస్టర్ ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని సూచించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి తులసి ఆగమయ్య, కోశాధికారి మానుపాటి బన్న తదితరులు పాల్గొన్నారు.

20న అర్చకుల 'చలో సెక్రటేరియట్'

కథలాపూర్: ధూప, దీప, నైవేద్య అర్చకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి మాధవాచారి తెలిపారు. అర్చకులకు ధూప, దీప నైవేద్యం పథకం కింద నెలకు రూ.10 వేలు ఇస్తున్నా.. వాటితో కుటుంబపోషణ కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలను పెంచి సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం ఇస్తామన్నారు. కార్యక్రమానికి అర్చకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫోకస్

- 'మన ఇసుక వాహనం' విజయవంతానికి చర్యలు
- ఇప్పటికే అప్రమత్తమైన సంబంధిత శాఖలు
- క్షేత్రస్థాయిలో కట్టుదిట్టంగా తనిఖీలు
- అయినా ఆగని ఇసుక అక్రమ రవాణా



కోరుట్ల వాగు నుంచి ఇసుక తరలిస్తున్న వాహనాలు

కోరుట్ల: జిల్లాలో మన ఇసుక వాహనం పథకం అమలు నేపథ్యంలో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. ఇసుక అక్రమ రవాణాను నిలువరించేందుకు సంబంధిత శాఖలు అన్నింటినీ అప్రమత్తం చేసింది. వారం రోజులుగా ఇసుక అక్రమ రవాణాపై సదరు శాఖల అధికారులు ఎక్కడికక్కడే తనిఖీలు చేస్తూ కట్టుదిట్టం చేస్తున్నా.. ఆశించిన ఫలితం మాత్రం కనిపించిన దాఖలాలు లేవు. అధికారుల కళ్లుగప్పి ఇసుక రవాణాదారుల తమ దందాను యథాతథంగా సాగిస్తుండటం గమనార్హం.

అక్రమ దందాకు చెక్ పెడితేనే..

జిల్లావ్యాప్తంగా జగిత్యాల, రాయికల్, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, ధర్మపురి ఏరియాల్లో అక్రమంగా ఇసుక తరలింపు షరామామూలుగా మారింది. గోదావరితీరంలో ఉన్న కొన్ని గ్రామాల్లో ఏకంగా ఇసుక టెండర్లు వేసి మరీ ఇసుక రవాణా దందా సాగిస్తున్న ఉదంతాలున్నాయి. ఈ ఇసుక అక్రమ దందాకు కొన్ని చోట్ల కొంతమంది రెవెన్యూ, పోలీసు అధికారులు పరోక్షంగా సాయం చేస్తున్నారనే సందేహాలు కూడా ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణా విషయంలో ఇన్నాళ్లుగా మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమ ఇసుక తరలింపును కట్టడి చేయకుండా అధికార యంత్రాంగం నిర్లిప్తంగా వ్యవహరిస్తే 'మన ఇసుక వాహనం' పథకం నీరుగారిపోయే ప్రమాదం ఉంది.

అధికారులు అప్రమత్తం..

మన ఇసుక వాహనం పథకం కింది ప్రస్తుతం జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో ధర్మపురి మండలంలోని ఆరెపల్లి, రాజారం, కోరుట్ల మండలంలోని పైడిమడుగు, రాయికల్ మండలంలోని ఇటిక్యాల, జగన్నాథ్‌పూర్, మల్లాపూర్ మండలంలోని సాతారం, మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్, కథలాపూర్ మండలంలోని తక్కళ్లపల్లి గ్రామాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక లభ్యమయ్యే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణాదారులు అక్కడ అడ్డాలు వేసి మరీ ఇన్నాళ్లు ఇసుకను తరలించారు. మన ఇసుక వాహనం పథకం ప్రారంభించి సుమారు ఆరు రోజులు కావస్తున్నా పెద్దగా స్పందన కానరాకపోవడంతో అధికారులు లోపాలపై దృష్టి సారించారు. మరోవైపు ఇసుక అక్రమ తరలింపు ఆగకపోవడంతోనే మన ఇసుక వాహనం పథకానికి సరైన స్పందన రావడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితిని గుర్తించిన జిల్లాస్థాయి అధికారులు కిందస్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. ఇందులో భాగంగానే రెవెన్యూ, మైనింగ్, పోలీస్, స్పెషల్ బ్రాంచి పోలీసులు ఇసుక రవాణాపై తనిఖీలు నిర్వహించి అరికట్టాలని సూచించారు. వారంరోజులుగా నాలుగు డిపార్ట్‌మెంట్లకు చెందిన అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఇసుక అక్రమ రవాణాను ఎక్కడికక్కడే అడ్డుకుని కేసులు నమోదు చేస్తున్నారు. ఈ తనిఖీలు పకడ్బందీగా సాగితే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడి 'మన ఇసుక వాహనం' పథకం సక్సెస్‌కు బాటలు పడతాయని అధికారులు భావిస్తున్నారు.

నిక్కచ్చిగా చర్యలు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి పూర్తి చర్యలు చేపట్టాం. కిందిస్థాయి సిబ్బందితో రాత్రింబవళ్లు తనిఖీలు చేయిస్తున్నాం. ఎలాంటి సమాచారం వచ్చినా.. వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నాం. ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే కేసుల తోపాటు జరిమానా విధిస్తున్నాం.

– కిషన్, తహసీల్దార్, కోరుట్ల

కమిషనర్ వస్తారా..? రారా..?

- బాధ్యతలు స్వీకరించేదెప్పుడో..?
- రాయికల్ బల్దియాపై విముఖత
- ఈనెల 24న బడ్జెట్ సమావేశం



రాయికల్ మున్సిపల్ కార్యాలయం

రాయికల్: రాయికల్ మున్సిపల్ కమిషనర్‌గా మెట్‌పల్లి కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఈనెల 13న ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ పనిచేసిన గంగుల సంతోష్‌కుమార్‌ను నిజామాబాద్‌కు బదిలీ చేసింది. అలాగే రాయికల్ మున్సిపల్ మేనేజర్‌గా పనిచేసిన వెంకట్‌ను నిజామాబాద్‌కు బదిలీ చేయగా.. నిజామాబాద్‌లో పనిచేసిన ప్రకాశ్‌ను ఇక్కడికి బదిలీ చేసింది. అయితే ప్రకాశ్ రెండు రోజులపాటు మున్సిపల్ కార్యాలయానికి వచ్చినా జాయినింగ్ రిపోర్ట్ కోసం కమిషనర్ లేకపోవడంతో అదనపు కలెక్టర్ వద్దకు వెళ్లారు. అక్కడ జాయినింగ్ రిపోర్ట్ చేశారు. మరోవైపు కమిషనర్ నేటికీ బాధ్యతలు చేపట్టలేదు. ఆయన రాయికల్‌కు రావడంపై విముఖత చూపుతున్నట్లు తెలిసింది. బల్దియాలో కొద్దిరోజులుగా కార్యాలయం నిర్వహణ గాడితప్పింది. పట్టణ ప్రజలు వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చి ఎవరికి చెప్పుకోవాలో తెలియక అధికారులు అందుబాటులో లేక వెనుదిరిగిపోతున్నారు. ఈనెల 24న జరిగే బడ్జెట్ ప్రత్యేక సమావేశం వరకైనా కమిషనర్ బాధ్యతలు స్వీకరించకుంటే ఎలా అని మున్సిపల్ సిబ్బంది తల పట్టుకుంటున్నారు. కలెక్టర్ స్పందించి కమిషనర్ బాధ్యతలు చేపట్టేలా చూడాలని లేకుంటే ఇతర కమిషనర్‌కు ఇన్‌చార్జి అప్పగించాలని పట్టణ ప్రజలు, కౌన్సిలర్లు కోరుతున్నారు.

గిరిజన పల్లెలకు 'మహాలక్ష్మి' ఎప్పుడో..?



చింతకుంట – రాజారాంతండాకు తారురోడ్డు

కథలాపూర్: మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో వారిలో సంతోషం వ్యక్తమవుతోంది. గ్రామాలకు అనుబంధంగా ఉన్న గిరిజన తండాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో వివిధ గ్రామాలు, పట్టణాలకు వెళ్లాలంటే వారు ఇక్కట్లపాలవుతున్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన ప్రభుత్వం గిరిజన తండాలకు బస్సు సౌకర్యం కల్పిస్తే మాకు మేలు జరుగుతుందని గిరిజనులు అంటున్నారు.

మండలంలో బస్సు సౌకర్యం లేని గిరిజన తండాలు ఇవే..

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలకు కోరుట్ల, మెట్‌పల్లి, వేములవాడ ఆర్టీసీ డిపోల నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా.. చింతకుంట గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజారాం తండాకు బస్సు సౌకర్యం లేకపోవడంతో వారు ప్రైవేట్ వాహనాలు ఆశ్రయిస్తున్నారు. అత్యవసర సమయాల్లో కాలినడకన చింతకుంట గ్రామానికి చేరుకొని అక్కడి నుంచి బస్సులల్లో పట్టణ ప్రాంతాలకు చేరుకుంటున్నారు. అంబారిపేట గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో గిరిజన తండా ఉండగా బస్సు సౌకర్యం లేదు. వీరికి కాలినడకే శరణ్యం. పోతారం గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో రెండు గిరిజన తండాలున్నప్పటికీ బస్సు సౌకర్యం లేదు. ఇప్పపెల్లి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో గిరిజన తండా ఉండగా బస్సు సౌకర్యం లేదు. బస్సు సౌకర్యంపై ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకునేవారు కరువయ్యారని గిరిజనులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తండాలకు బస్సు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం లేదు



ఊరికి 4 కిలోమీటర్ల దూరంలోని తండాలో నివసిస్తున్నాం. బస్సు సౌకర్యం లేదు. అనారోగ్యం, అత్యవసర పరిస్థితుల్లో ఇతర గ్రామాలకు వెళ్లాలంటే బైకులపై త్రిబుల్ రైడింగ్ చేయాల్సిందే. కొన్ని సందర్భాల్లో కాలినడకన గమ్యాన్ని చేరుకుంటున్నాం. రాత్రివేళల్లో మరింత కష్టం. పాలకులు దృష్టిసారించి మా గిరిజన తండాలకు బస్సు సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

– లోక్యనాయక్, పోతారంతండా

'మహాలక్ష్మి' తండాలకు చేరాలి



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం మంచిదే. మా గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా.. బస్సు సౌకర్యం లేకపోతే మహాలక్ష్మి పథకం మాకు లేనట్టే. అధికారులు తండాలను పరిశీలించి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి. అన్ని గ్రామాల ప్రజల మాదిరిగానే తాము బస్సుల్లోనే ఇతర గ్రామాలకు వెళ్లాలనుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– లావుడ్యా సరిత, మాజీ సర్పంచ్, రాజారాం తండా



అడవుల్లో ఫైర్‌లైన్స్

సారంగాపూర్: జిల్లాలో సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. వేసవిలో ఆకురాలి అగ్ని ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉంటుంది. ఫలితంగా అడవులకు నష్టం వాటిల్లే అవకాశముంటుంది. ఈ క్రమంలో మంటలు అంటుకోకుండా.. ఒకవేళ అంటుకున్నా వ్యాపించకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎండిపోయిన ఆకులను రోడ్ల వెంట రెండు మండలాల్లో 50 కిలోమీటర్ల వరకు ఫైర్‌లైన్లను ఏర్పాటు చేసి మంటలు అడవుల్లోకి పోకుండా కాపాడుతున్నారు.



నేటినుంచి బీర్‌పూర్ లక్ష్మీనృసింహస్వామి జాతర

- 12 రోజులపాటు బ్రహ్మోత్సవాలు
- ఈనెల 21న స్వామివారి కల్యాణం
- 29న రథోత్సవం



స్వామివారి ఆలయం



ఉత్సవమూర్తి

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈనెల 19న ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు మార్చి రెండో తేదీ వరకు (12 రోజులపాటు) జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు వివిధ జిల్లాల నుంచి దాదాపు రెండు లక్షల మంది భక్తులు తరలిరానున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవాలు జరిగేది ఇలా..

- 19 సాయంత్రం స్వామివారి ఊరేగింపు సేవ
- 20న సాయంత్రం 4 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం
- 21న సాయంత్రం 6 గంటలకు స్వామివారి కల్యాణం
- 22న సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, బలిహరణం
- 23న వసంతోత్సవం
- 24న చందనోత్సవం, డోలోత్సవం, తెప్పోత్సవం
- 25న పార్వేట్ ఉత్సవం
- 26న వనమహోత్సవం
- 28న వేదసదస్సు
- 29న వేకువజామున డోపుకథ, మహాపూర్ణాహుతి, సాయంత్రం రథోత్సవం
- మార్చి ఒకటిన ఏకాంతోత్సవం
- 2న ఏకాదశ కలశస్నపన తిరుమంజనం కార్యక్రమాలు ఉంటాయి.
- ఈనెల 22 నుంచి 29 వరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నిత్యహోమం, బలిహరణం కార్యక్రమాలు జరుగుతాయి.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దంపతులు

ధర్మపురి: ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యాలయం ముందు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యాలయం లోపల గోమాతకు ప్రత్యేక పూజలు, గణపతి పూజ, హోమం, పుణ్యాహవచనం నిర్వహించారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

బ్రహ్మోత్సవాలకు రండి

పెగడపల్లి: పెగడపల్లి మండలంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి 24 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ధర్మపురిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఆలయ కమిటీ సభ్యులు తిరుపతి, మోహన్ ఉన్నారు.

ఉచిత స్టడీ సెంటర్ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

కోరుట్లటౌన్: కోరుట్లలోని సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో ఉచిత స్టడీ సెంటర్ కరపత్రాన్ని ఎంఈవో గంగుల నరేశం ఆదివారం ఆవిష్కరించారు. గ్రంథాలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు చెన్న విశ్వనాథం, అధ్యక్షుడు రాస భూమయ్య సమక్షంలో స్టడీ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు స్టడీ సెంటర్ ఉపయోగపడుతుందని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెన్న విశ్వనాథం మాట్లాడుతూ ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేశామన్నారు. భూమయ్య మాట్లాడుతూ స్టడీ సెంటర్‌లో సదుపాయాలు కల్పించామన్నారు. ఉదయం 8నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటుందన్నారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, లైబ్రేరియన్ మామిడిపెల్లి రామకృష్ణ, గ్రంథాలయ కమిటీ ప్రతినిధులు ఎల్.నరేందర్, సుతారి రాములు, చింత భూమేశ్, గంగమణి, ఎండీ.ముఖ్రం, రుద్ర నాగరాజు, బోగ అశోక్, సీవీ.ప్రకాష్, పోతుగంటి మనోజ్, పాఠకులు పాల్గొన్నారు.

'కార్గో' ద్వారా మేడారం ప్రసాదం



విజయ మాధురి

కోరుట్ల: భక్తుల సౌకర్యం కోసం మేడారం సమ్మక్క, సారలమ్మ ప్రసాదం, పసుపు, కుంకుమను కార్గో ద్వారా నేరుగా భక్తుల ఇంటికే చేర్చే సౌకర్యాన్ని ఆర్టీసీ కల్పించిందని కోరుట్ల డిపో మేనేజర్ విజయ మాధురి తెలిపారు. మేడారం జాతరకు వెళ్లలేని భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఆర్టీసీ ఏర్పాటు చేసిన స్కానర్ ద్వారా పేటీఎం ఆఫ్‌లో, ఈవెంట్స్‌లో నేరుగా ఒక ప్రసాదానికి రూ.299 చెల్లించి బుక్ చేసుకోవచ్చని, ఆర్టీసీ బస్టాండ్‌లలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ద్వారా లేదా బస్టాండ్‌లోని కార్గో ఏజెంట్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 91542 98572నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

ముత్యంపేట పోచమ్మ ఆలయంలో చోరీ


గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టిన హుండీ

మల్యాల(చొప్పదండి): మండలంలోని ముత్యంపేట పోచమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీని పగులగొట్టి, భక్తులు హుండీలో వేసిన నగదు, ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని సమాచారం. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు హుండీ పగులగొట్టి ఉండడాన్ని గమనించి వీడీసీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం


సహాయక చర్యల్లో గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఒకరి ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బద్దం గంగారెడ్డి ఇంట్లో ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. గ్రామస్తులు గమనించి నీళ్లు చల్లి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఇంట్లోని వస్తువులు, పైకప్పు పూర్తిగా కాలిపోయింది. చివరకు ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పేసింది. ఘటనలో సుమారు రూ.5లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు, అధికారులు పేర్కొన్నారు.

కుక్కలదాడిలో 28 గొర్రెపిల్లల మృతి


గొర్రె పిల్లలు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామానికి చెందిన అత్తెన మల్లేశంకు చెందిన గొర్రెల మందపై ఆదివారం వేకువజామున కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 28 గొర్రెపిల్లలు మృతిచెందాయి. గొర్రెల కాపరి కేకలు వేయడంతో స్థానికులు కుక్కలను తరిమివేశారు. బాధితుడికి ప్రభుత్వం పరిహారం అందించాలని స్థానికులు కోరారు. అలాగే కుక్కల బెడదను అరికట్టాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


పెరుగు శేఖర్(ఫైల్)

మల్యాల(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతిచెందాడు. మల్యాల మండలం గొల్లపల్లె గ్రామానికి చెందిన పెరుగు శేఖర్ (27) బైక్‌పై జగిత్యాల వెళ్తుండగా.. మద్దుట్ల గ్రామానికి చెందిన వంగల శివ జగిత్యాల నుంచి మద్దుట్లకు వస్తూ శనివారం రాత్రి రాజారం గ్రామం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో శివ కాలు, చేయి విరిగింది. శేఖర్ తలకు తీవ్రంగా గాయం కావడంతో కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ శేఖర్ ఆదివారం మృతిచెందడంతో గొల్లపల్లిలో విషాదం నెలకొంది.

సుల్తానాబాద్‌లో ఖోఖో.. సిరిసిల్లలో కబడ్డీ

- ఉమ్మడి జిల్లాకు ఖేలో ఇండియా సెంటర్లు మంజూరు
- ఇప్పటికే కరీంనగర్‌లో జూడో సెంటర్
- క్షేత్రస్థాయిలో క్రీడాభివృద్ధికి దోహదం
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాభిమానులు



సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌కు మంజూరైన క్రీడాప్రాంగణం

కరీంనగర్‌స్పోర్ట్స్: క్రీడల్లో ఇండియాను నంబర్‌వన్‌గా నిలిపేందుకు కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ ఖేలో ఇండియా సెంటర్లు ఏర్పాట్లు చేస్తోంది. దేశవ్యాప్తంగా జిల్లాకో క్రీడా సెంటర్ మంజూరు చేస్తోంది. గతంలో కరీంనగర్ జిల్లాకు జూడోలో ఖేలో ఇండియా సెంటర్ మంజూరు చేయగా.. తాజా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఖోఖో, రాజన్న సిరిసిల్ల జిల్లాకు కబడ్డీ సెంటర్‌ను మంజూరు చేసింది. దీంతో ఆయా జిల్లాల్లోని క్రీడలు క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరిగేందుకు అవకాశం ఏర్పడింది. దీంతో నైపుణ్యంగల క్రీడాకారులకు సువర్ణ అవకాశం కల్పించినట్లయ్యింది.

ఖోఖో ఖిల్లా.. సుల్తానాబాద్

తెలంగాణలో ఖోఖో ఖిల్లాగా పేరుగాంచిన సుల్తానాబాద్‌లో ఖోఖోక్రీడలో ఖేలో ఇండియా సెంటర్ మంజూరుకావడం విశేషం. ఇక్కడి క్రీడాకారులు 75మందికి పైగా జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొన్నవారే. పలువురు క్రీడాకారులు జాతీయస్థాయిలో బంగారు, రజత, కాంస్య పతకాలు సైతం సాధించారు. ఇదే ప్రాంతానికి చెందిన గెల్లు మధుకర్ యాదవ్ రెండుసార్లు భారత ఖోఖో జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం మంజూరైన ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌కు కోచ్‌గా నియామకమయ్యారు. నేడు సుల్తానాబాద్‌లోని మార్కండేయాకాలనీలోని తెలంగాణ గ్రామీణ క్రీడాప్రాంగణంలో సెంటర్ ప్రారంభం కానుంది.

కబడ్డీ కంచుకోటలో

ఉమ్మడి జిల్లాలో కబడ్డీకి కంచుకోటగా పిలిచే నూకలమర్రి, చెక్కపల్లి ప్రాంతాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలోనివే. తమ జిల్లాకు కబడ్డీ ఖేలో ఇండియా సెంటర్ మంజూరు కావడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. రెండు ప్రాంతాల నుంచి సుమరు వందల సంఖ్యలో క్రీడాకారులు జాతీయస్థాయిలో సత్తాచాటారు. ప్రస్తుతం మంజూరైన ఖేలో ఇండియా కబడ్డీ సెంటర్ రాజీవ్‌నగర్‌లోని మినీ స్టేడియంలో త్వరలో ప్రారంభం కానుంది. జిల్లాస్థాయిల్లో ఖేలో ఇండియా సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ నిర్ణయించడంపై జిల్లాలోని క్రీడాభిమానులు, క్రీడాసంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంచి రోజులు



జిల్లాల్లో ఖేలో ఇండియా సెంటర్లు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం. క్షేత్రస్థాయిలో క్రీడాభివృద్ధి జరుగుతుంది. క్రీడాకారులుగా ఎదుగాలనే వారికి ఖేలో ఇండియా సెంటర్లు దిక్సూచిగా పనిచేస్తాయి. కబడ్డీ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– అజ్మీరా రామదాసు, డీవైఎస్‌వో రాజన్న సిరిసిల్ల

గ్రామీణులకు అవకాశం



జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న ఖేలో ఇండియా సెంటర్లతో గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు లభిస్తాయి. సెంటర్లలో మెరుగైన శిక్షణ లభిస్తుంది. ఉన్నతమైన ప్రమాణాలు, శిక్షకులతో ప్రతీరోజు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయి. తద్వారా నైపుణ్యంగల క్రీడాకారులుగా ఎదగవచ్చు.

– సురేశ్, డీవైఎస్‌వో పెద్దపల్లి

అద్భుతమైన శిక్షణ ఇస్తా



రెండుసార్లు భారత జట్టుకు ఆడిన. సుమారు 60కి పైగా జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న అనుభవం ఉంది. దీంతో ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌లో శిక్షణపొందే క్రీడాకారులకు అద్భుతమైన శిక్షణ అందిస్తా. సుల్తానాబాద్ ఖోఖో చరిత్రకు పూర్వవైభవం తీసుకొస్తా. ఆసక్తి గల క్రీడాకారులు దరఖాస్తులు చేసుకోవాలి.

– గెల్లు మధుకర్ యాదవ్, కోచ్, సుల్తానాబాద్

పూర్వవైభవం



ఖోఖోకు కేరాఫ్ అడ్రస్ సుల్తానాబాద్. అలాంటి సుల్తానాబాద్‌కు ఖేలో ఇండియా సెంటర్ రావడం సంతోషకరమైన విషయం. సుల్తానాబాద్ ఖోఖోకు పూర్వవైభవం రానుంది. సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ పక్షాన అన్ని రకాల సాయం అందిస్తాం. ఖేలో ఇండియా సెంటర్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– ముస్త్యాల రవీందర్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు

బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన


బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న సంఘం ప్రతినిధులు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలకు స్పందన వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40మంది క్రీడాకారులు హాజరయ్యారు. విశేష ప్రతిభ కనబరిచిన గుర్రాల హరిహర, జి.శివకృష్ణ, కె.రాజు, డి.వర్షిత్ కుమార్, ఈ.లక్ష్మీలీల, గుర్రాల హరిణి, శ్రీ.,ఠాకూర్ తేజస్విని, పవన్, ఆర్.బాలరాజ్, ఓ.అక్షయ్ కార్తీక్, పెండం కావ్య శ్రీ.,, దామరిచి రచన, వేల్పుల అక్షిత, ఆర్.కల్యాణి, కె.అక్షరను ఈ నెల 21,22 తేదీల్లో సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి.సత్యనారాయణ, కొత్తకొండ సంపత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.మురళి, ఎం.శ్రీకాంత్, పృథ్వీరాజ్, గోల్కొండ శ్రీరామ్, కుమార్‌స్వామి, రఘువీర్‌సింగ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు


సెమీఫైనల్‌లో ప్రవేశించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుతో ఏసీపీ ప్రతాప్

- పురుషుల సెమీస్‌లో కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్
- మహిళల సెమీఫైనల్‌లో హైదరాబాద్, వరంగల్ జిల్లాల జట్లు
- నేటితో ముగియనున్న రాష్ట్రస్థాయి పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ రేకుర్తిలోని లయోలా కళాశాల ఆవరణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీలు చివరిదశకు చేరుకున్నాయి. పురుషుల విభాగంలో ఆతిథ్య కరీంనగర్‌తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లా జట్లు, మహిళల విభాగంలో హైదరాబాద్, వరంగల్ జిల్లాల జట్లు సెమీఫైనల్‌లో ప్రవేశించాయి. నేడు సెమీఫైనల్, ఫైనల్ పోటీలు జరుగుతాయని, సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్లు సత్తాచాటి పతకాలు సాధించాలని ఏసీపీ సి.ప్రతాప్ సూచించారు. ఆదివారం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని రెండోరోజు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందుతుందని అన్నారు. క్రీడా కోటాతో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రజనీకాంత్, తెలంగాణ హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, రాష్ట్ర, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు, పీడీలు, పీఈటీలు బసరవేణి లక్ష్మణ్, ప్రభాకర్, మూల వెంకటేశ్, వేల్పుల సురేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చింతకాయల కోసం చెట్టు ఎక్కి..

- చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

ధర్మారం(ధర్మపురి): నందిమేడారం గ్రామానికి చెందిన పీసు రఘునందన్‌రెడ్డి (65) ప్రమాదవశాత్తు ఆదివారం ఉదయం చింతచెట్టు పైనుంచి పడి మరణించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఇంటి సమీపంలోని చింతచెట్టుపైకి ఎక్కి చింతకాయలు తెంపుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి రాళ్లగోడపై పడ్డాడు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోని చొప్పదండి వద్ద మరణించాడు. మృతుడి కుమారుడు దేవేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందతూ వ్యక్తి మృతి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలం చందనాపూర్ గ్రామానికి చెందిన మేకల రవి(35) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తన భార్య కొన్నిరోజుల నుంచి కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురైన రవి.. శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి సోదరుడు మేకల కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


రాజు (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఓ వ్యక్తి అనారోగ్యంతో మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ సారంపల్లి ప్లాట్స్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా అంబారీపేటకు చెందిన గుండం రాజు (32) మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఉపాధి కోసంరెండేళ్లక్రితం గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో 7 నెలలక్రితం తిరిగి వచ్చాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఏపని చేయలేక తనలో తానే మదనపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆది వారం వేకువజామున ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, తండ్రి ఉన్నారు. తంగళ్లపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

మల్యాల(చొప్పదండి): అజాగ్రత్తగా, అతివేగంగా కారు నడిపి, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. మల్యాల ఎస్సై కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలం అప్పారావుపేటకు చెందిన గరిగంటి శ్రీనివాస్ జగిత్యాలకు వెళ్లి, తిరుగు ప్రయాణంలో మల్యాల మండలం ముత్యంపేట శివారులోని టౌన్‌షిప్ సమీపంలో శనివారం గోనె వందన్‌కుమార్ తన కారును అజాగ్రత్తగా.. అతివేగంగా నడిపి, బైక్‌కు ఢీకొనడంతో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

- ఒకరి తీవ్ర.. ఇద్దరికి స్వల్పగాయాలు


అదుపుతప్పి పంటపొలాల సమీపంలో పడిన కారు

సిరిసిల్లక్రైం: ముస్తాబాద్ నుంచి వేములవాడ వైపు సిరిసిల్ల రెండో బైపాస్ మీదుగా వస్తున్న కారు అతివేగంతో అదపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. స్థానికుల వివరాల ప్రకారం.. అతివేగంతో వస్తున్న కారు పెద్దూరు శివారులోని అపరల్ పార్క్ సమీపంలో అదుపుతప్పి ఒక్కసారిగా రోడ్డు కిందకు దూసుకెళ్లింది. కారులో ఉన్నవారు అరవడంతో స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగ్రాతులను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న ప్రవీణ్‌కు తీవ్రగాయాలు కాగా, మెరుగైన వైద్యం కోసం సిద్ధిపేట తరలించారు. మరో ఇద్దరికి స్వల్పగాయాలైనాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని సుద్దాల గ్రామ సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు.. కనగర్తి గ్రామానికి చెందిన వేణు వేములవాడలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా సుద్దాల సబ్‌స్టేషన్ వద్ద గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో వేణుకు తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వేములవాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న బీజేపీ

- మతతత్వ విధానాలతోనే పేదరికం
- రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి
- ఉపాధి కార్మికులకు రూ.600 చెల్లించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్లలో నిర్వహించిన ఉపాధిహామీ కార్మికుల జిల్లాస్థాయి సదస్సులో మాట్లాడారు. పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలు చేయడంతోనే దేశంలో పేదరికం పెరిగిపోతోందన్నారు. కో–ఆపరేటివ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ.. కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను మోదీ సర్కారు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించి, చనిపోయిన 700 రైతుల కుటుంబాలకు పరిహారం అందివ్వాలని, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో అత్యధికంగా నిధులు కేటాయించాలని, గ్రామాల్లో పనిచేసే కార్మికులకు పనిముట్లు ప్రభుత్వమే అందించి, 15రోజులకు ఒకసారి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్కో కార్మికునికి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలన్నారు. కార్మికుల, కర్షకుల సంక్షేమం కోసం బీజేపీ విధానాల ను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఎంబాల మల్లేశ్, కడారి రాములు, జంగం అంజన్న, అజ్జ వేణు, మీస లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కథలాపూర్: కథలాపూర్ మండలం కలిగోట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబారిపేట గ్రామానికి చెందిన శీలం శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ కలిగోట శివారులోని సత్యనారాయణస్వామి దేవాలయం వద్ద శనివారం రాత్రి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కుమారుడు సిద్ధయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

కారు, ఆటో ఢీ: ఇద్దరికి గాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపెల్లి శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై ఆదివారం కారు, ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. తక్కళ్లపెల్లికి చెందిన నారుపాక అరుణ, మల్లవ్వ పనినిమిత్తం ఆటోలో జగిత్యాల వస్తున్నారు. ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు దాటుతుండగా.. అదే సమయంలో ఓ కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న అరుణ, మలవ్వకు తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

18 ఏళ్ల నిరీక్షణకు మోక్షం

- దుబాయ్ జైలు నుంచి విడుదలై ఇంటికి చేరిన మానాల వాసి
- కేటీఆర్ కడుపు సల్లగుండాలి: హనుమంతు భార్య పద్మ


పద్దెనిమిదేళ్ల అనంతరం భర్త హనుమంతుతో భార్య పద్మ, కూతురు గౌతమి

మల్యాల(చొప్పదండి): పెళ్లైన ఏడాదికే ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి.. అక్కడ హత్యకేసులో ఇరుక్కుని జైలుకెళ్లి 18 ఏళ్ల తర్వాత ఇంటికి చేరాడు జగిత్యాల జిల్లా మల్యాల మండలం మానాల గ్రామానికి చెందిన శివరాత్రి హనుమంతు. గ్రామానికి చెందిన శివరాత్రి హనుమంతుకు బుగ్గారం మండలం గోపులాపురానికి చెందిన పద్మతో 20ఏళ్ల క్రితం వివాహమైంది. పెళ్లైన ఏడాదికే ఉపాధి కోసం హనుమంతు దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాడు. పాప పుట్టిన తర్వాత పురుడు చేసిన మరునాడే దుబాయ్ వెళ్లాడు. మూడు నెలలకే హత్య కేసులో జైలుకెళ్లాడు. అప్పటి నుంచి ఆయన భార్య పద్మ భర్త కోసం ఎదురుచూస్తూనే ఉంది. ఆమె 18ఏళ్ల నిరీక్షణ ఫలించాయి. దుబాయ్ జైలు నుంచి విడుదలై ఇంటికి చేరిన భర్త హనుమంతును చూసి కడుపులో దాచుకున్న దుఃఖం కట్టలు తెంచుకుంది. 'మాది రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద వడ్డెర కుటుంబం. ఉపాధి కోసం ఆయన (హనుమంతు) దుబాయ్ పోయిండు. అక్కడ జైలులో పడ్డడు. పద్దెనిమిదేళ్లుగా భర్త కోసం ఎదురుచూసిన. నా ఐదుగురు అన్నలు, ఇద్దరు తమ్ముళ్ల సహకారంతో తల్లిగారింట్లో ఉంటూ.. బీడీలు చేస్తూ, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కాలం వెళ్లదీసిన. మూడు, నాలుగు నెలలకు ఒకసారి భర్తతో ఫోన్‌లో మాట్లాడిన. భర్తను తలుచుకుని ఏడుస్తూ నిద్రలేని రాత్రులు గడిపిన. కూతురు గౌతమిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన. హనుమంతును ఇంటికి రప్పించేందుకు కేటీఆర్ సారును కలిసినం. కేటీఆర్ సారు కడుపు సల్లగుండ ఆయన చేసిన మేలుతో దుబాయ్ జైలు నుంచి నా భర్త బయటపడి ఇంటికి చేరిండు. ఆయన చేసిన మేలు జీవితకాలం మరిచిపోను..' అని తన భర్త జైలు నుండి విడుదల కోసం కృషి చేసిన మాజీ మంత్రి కేటీఆర్‌కు హనుమంతు భార్య పద్మ కృతజ్ఞతలు తెలిపింది.

తరలివచ్చి.. మొక్కులు చెల్లించి





వేములవాడ: రాజన్న సన్నిధి రద్దీతో కిటకిటలాడింది. సమ్మక్క జాతర సమీపిస్తుండటంతో స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆదివారం 40 వేల మంది రాజన్నను దర్శించుకున్నారు. దీంతో రూ.అరకోటి ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 20న హుండీ లెక్కింపు గత రెండునెలలుగా అశేషంగా తరలివస్తున్న భక్తులతో రాజన్న హుండీలు నిండిపోతున్నాయి. ఇటీవలే హుండీలు లెక్కిస్తే గతంలో ఏనాడు లేనివిధంగా ఆదాయం రూ.రెండున్నర కోట్లు సమకూరింది. మళ్లీ హుండీలు నిండిపోవడంతో ఈనెల 20న హుండీ ఆదాయం లెక్కించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో జరిగే హుండీ లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఈవో కృష్ణప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.